ంట్లకి, పెట్రోల్ బంకులకి అందించేవాడు. ఒకసారి ఒక రెస్టారెంట్ మేనేజర్ 'మీ పుస్తకాల కోసం షెల్ఫులు వేయించా కానీ, ఇంకా వాటిని బిగించ లేదు' అన్నాడు. వెంటనే అనంత పాయ్ తనసంచిలోంచి సుత్తి, మేకులు తీసి అతడి షెల్ఫులను బిగించి, వాటిలో తన కామిక్స్ వుంచి వెళ్ళాడు.

1976 నాటికి అతడి కామిక్స్ అమ్మకాలు 40 లక్షలకు చేరుకున్నాయి. అతడి మొదటి కామిక్స్ 'కృష్ణ' 80 సార్లు అనేక భాషలలో ప్రచురింపబడి దాదాపు ఒక మిలియన్ కాపీలకు పైగా అమ్ముడయింది. కేవలం పురాణ పురుషుల పైనే కాకుండా చరిత్ర, సంస్కృతి, జాతీయ, ప్రాంతీయ నాయకుల పైనా అనేక కామిక్‌లను అనంత్ వెలువరించాడు. 'ఒక ప్రాంతంలోని సంస్కృతి, ఆచారాలను గూర్చి మిగిలిన వారికి కూడా తెలిపి, తద్వారా జాతీయ సమైక్యత సాధించే లక్ష్యంతోనే వివిధ జాతీయ, ప్రాంతీయ నాయకుల కథలు వెలువరిస్తున్నాను' అంటారు అనంత పాయ్. ఈ కామిక్స్ ఖ్యాతి నలుదిశలా వ్యాపించి, ఫ్రాంక్ ఫర్ట్‌లో జరిగిన బుక్ ఫెయిర్‌లో ఇవి ప్రదర్శించ బడటమే కాకుండా కొన్ని సంపుటాలు ఫ్రెంచి, ఇతర భాషలలోనికి అనువదించబడి ముద్రించ బడ్డాయి. అనంతపాయ్ స్వయంగా సతీ దురాచారాన్ని ఖండిస్తూ స్త్రీలలో ధైర్య సాహసాలను పెంపొందించేందుకై ఎందరో వీరనారీమణుల చరిత్రలతో కామిక్స్ వెలువరించాడు. వాటిలో ద్రౌపది, రాణి ఆఫ్ ఝాన్సీ, చాంద్ బీబీ, అహల్యా బాయి హోల్కార్, సుల్తానా రజియా, రాణి అబ్బక్క మొదలైనవి స్త్రీలను బాగా ఆకర్షించాయి.

1980లో అనంత పాయ్ 'టింకిల్' అనే పక్షపత్రికను పిల్లలకోసం ఆంగ్లంలో ప్రచురించడం మొదలు పెట్టాడు. అమర్ చిత్రకథ, టింకిల్ పత్రికల ప్రచారం కోసం అనంతపాయ్ భారతదేశం అంతటా పర్యటిస్తూ స్కూళ్ళలో క్విజ్‌లు, డిబేట్‌లు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తూ బహుమతులు ఇచ్చేవాడు. ఇటీవలే బొంబాయిలో నిర్వహించిన ఒక క్విజ్‌లో దాదాపు వెయ్యిమంది దంపతులు తమ పిల్లలతో సహా పాల్గొన్నారు. అదే సమయంలో దూరదర్శన్‌లో ఒక క్రికెట్ మ్యాచ్ ప్రసారం అవుతున్నా ఎవరూ కూడా క్విజ్ పూర్తయ్యే వరకు కదల లేదంటే విశేషమే మరి!

75 వేల కాపీలు అమ్ముడుపోయే టింకిల్ పక్షపత్రిక ద్వారా అనంత్ పాయ్‌కి ప్రతిరోజూ వందల కొలదీ ఉత్తరాలు వస్తుంటాయి. ఉత్తరాలద్వారా పిల్లలు అడిగే ప్రశ్నలకు జవాబులు రాయడం అతడికి ఎంతో తృప్తినిస్తుంది. వివాహం అయినా, సంతానం లేని అనంతపాయ్ 'దేశంలో పిల్లలంతా నా బిడ్డలే' అంటారు సంతృప్తిగా!

# వినాయకుడి వీణ



జన ప్రవాహానికి ప్రయాసతో ఎదురు ఈదుకుంటూ కాస్త ఆలస్యంగా ఇల్లుచేరుకున్న రవి విశాలమైన కళ్ళలో ఎన్నో ధర్మ సందేహాలు. తనచుట్టూ కనపడుతున్న ప్రపంచాన్ని తను చదువుకుంటున్న పాఠాల్లోని సుభాషితాల్తో అన్వయించుకుని అప్పుడప్పుడు అయోమయ స్థితిలో పడిపోతూ ఉంటాడు.

ఆ రోజు స్నేహితులతో కలిసి టాంక్ బండ్ దాకా పోయి వినాయకుల నిమజ్జనం కొంతవరకూ చూసి ఇంక చీకటి పడిపోతుందనగా ఇంటి ముఖం పట్టాడు. దారిపొడుగునా రాజకీయ నాయకులు ఉత్సవంలో పాల్గొని ఉపన్యాసాలిస్తూ ప్రసాదాలు పంచుతూ రక్తికట్టించారు. ఆకాశంలో హెలికాప్టర్ తిరిగింది. వీధి వీధినుండీ వాడవాడనుండీ వినాయకులు అంచలంచలుగా లారీల మీద కదలి వెళ్ళారు. విగ్రహాలు క్రేన్ సహాయంతో నీట మునుగుతున్నాయి. ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తు. ఇతర వాహనాల రాకపోకలకు ప్రత్యేక నిబంధనలూ ఆంక్షలూ. ఒక వినాయకుడి విగ్రహం 30 అడుగుల ఎత్తుంటే ఇంకొకటి 35 అడుగుల ఎత్తు. ఇలా రూపాల్లో, పరిమాణాల్లో, ఎత్తులో, అలంకరణలో వినాయకులు పోటీ పడుతున్నారు అధికారపుటంచనా ప్రకారం చిన్నా పెద్దా సుమారు ఐదువేల విగ్రహాలకు పైగా నిమజ్జనం కావలసి ఉందని ఎవరో చెప్పుకుంటున్నారు దారిలో.

రవి నాన్నకు ఆ రోజు ఒంట్లో సులువుగా లేదుకానీ ఉంటే ఆ రాత్రి నిమజ్జనం పూర్తిఅయ్యేదాకా ఉండి ఇంటికి వచ్చేవాడే. ఇంట్లో పూజ చేసుకుని గోడకు వేలాడుతున్న దైవ స్వరూపాలన్నిటినీ అప్పుడే కుంకుమ బొట్టు పెట్టి, తమా ఫాలభాగాన బొట్టు దిద్దుకుని వీధి గుమ్మంలోకి వచ్చాడు. తండ్రిని చూస్తూనే రవి వీధి మెట్లు ఎక్కుతూ తన మనసులోని సందేహాన్ని యక్ష ప్రశ్నలాగ సంధించాడు.

"నాన్నా అశోకుడు చెరువులు తవ్వించాడనీ బావులు తవ్వించాడనీ హిస్టరీ పాఠంలో చెప్పారుకదా మరి టాంక్ బండ్ దగ్గర ఎన్ని విగ్రహాలో ముంచుతూ.." .అంటూ అమాయకంగా వేస్తున్న చిన్నారి ప్రశ్న పూర్తి కాకుండానే నోరు మూయించి " అయ్యో! ఎంత అవాచకం రా! చదవ్వేస్తే ఉన్న మతి పోయినట్లు భయం భక్తీ లేని ప్రశ్న. నాస్తికుడివై పోవుకదా" అని అడ్డు పడ్డాడు రవి నాన్న. రవి మనసులోని సందేహం అలాగే ఆ చిన్నారి మనసులో ఉండి పోయింది.

ఆ రాత్రి మెల్లగా నిద్రలోకి జారుకునే వేళ రవికి ఎవరో ప్రేమతో నిమిరినట్లు అనిపించింది. తమాషా అయిన కల. వినాయకుడు రవిని తన తొడ మీద

గిడుగు రాజేశ్వర రావు

కూర్చో పెట్టుకున్నాడు. వింతగా వీణ మీటినట్లు వినిపించాయి రవి చెవిలో వినాయకుడి మాటలు. "తమ్ముడూ! నీ సందేహం నిజంగా అడగ వలసినదే. సిగ్గు పడకు. చెరువులూ బావులూ తవ్వించి ప్రజలకిచ్చిన అశోకుడు గొప్పవాడే. నా పేరుమీద చెరువులూ సరస్సులూ పూడ్చుకోవడం వేడుకై పోయింది. తేరగా ప్రజల డబ్బు వుంటే మళ్ళీ డ్రెడ్జింగ్ కంపెనీకి పని ఇచ్చి పూడిక తీయించుకుంటారు—అవసరమైతే. వాళ్ళ పిచ్చి కూలా! నువ్వు అలసి పోయావు. ఇంక పడుకో" అంటూ ప్రేమగా రవిని పడుకోబెట్టి అదృశ్యమై పోయాడు.

'కలడు కలండనెడి వాడు కలడో లేడో' అన్న మీమాంస ఇంకా ఉదయించని వయసువాడు రవి. దేవుడు కూడా తనలాగే ఆలోచిస్తాడన్న తియ్యని ఊహ ఎంతో ఉపశమనం కలిగించింది ఆ చిన్నారి మనసుకి.